క్లుప్తంగా

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోండి

పులివెందుల రూరల్ : పులివెందుల ఆర్టీసీ డిపో నందు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 99592 25780కు ఫోన్ చేయాలన్నారు. ఆర్టీసీకి సంబంధించి ఏవైనా సమస్యలుంటే ప్రయాణికులు వాట్సాప్ ద్వారా పై నెంబరుకు తెలుపవచ్చన్నారు. ఆర్టీసీ నిర్వహించే డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ప్రయాణికులకు బస్సుల్లో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ



విద్యార్థులకు దుస్తులు అందించిన ఐసీఎల్ యాజమాన్యం

ఎర్రగుంట్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని క్రీడాకారులందరికీ ఐసీఎల్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆధ్వర్యంలో గురువారం క్రీడాదుస్తులను పంపిణీ చేసినట్లు ఐసీఎల్ వైస్ ప్రెసిడెంట్ మారిముత్తు తెలిపారు. సుమారు రూ.25 వేలు విలువగల 60 జతలను అందించామన్నారు. కార్యక్రమంలో హెచ్ఆర్ హెడ్ నాగిరెడ్డి, సీఎస్ఓ ప్రసాద్, సీనియర్ ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి, వృత్తి విద్యా ఉపాధ్యాయుడు చంద్రఓబుళరెడ్డి, పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతి



ఆర్టీపీపీ సీఈ గౌరీపతిని కలిసిన యూనియన్ నాయకులు

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీరు గౌరీపతిని గురువారం ఆర్టీపీపీలో ఉన్న పలు యూనియన్ల నాయకులు కలసి ఆర్టీపీపీలోని ప్రధాన సమస్యలపై చర్చించారు. అనంతరం ఆర్టీపీపీలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై వారు సీఈ దృష్టికి తెచ్చారు.

బాలికలకు అవగాహన సదస్సు



బాలికలకు అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది, మహిళా పోలీసు

లింగాల : మండలంలోని పార్నపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బాలికలకు బాల్య వివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అన్న విషయాలపై మహిళా పోలీసులు, పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన సదస్సు నిర్వహించారు. 2006 యాక్ట్, 2012 పర్సనల్ ఏజెన్సీలపై బాలికలకు అవగాహన కల్పించారు. బాలికలు చట్టప్రకారం ఎలా చర్యలు తీసుకోవాలి, ఎలా తమను తాము రక్షించుకోవాలి అన్న విషయాలను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికలకు కల్పిస్తున్న చట్టాలు, రక్షణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జానకి, ఎంఎల్‌హెచ్‌పీ గాయత్రి, మహిళా పోలీసు వరలక్ష్మి, ఏఎన్ఎంలు సాయిమాల, ఆశావర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్నను గెలిపించుకుందాం

ఎర్రగుంట్ల : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని, ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డిలను మళ్లీ గెలిపించుకోవాల్సి బాధ్యత మనపై ఉందని మున్సిపల్ చైర్మన్ మూలె హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం జువారి ఫ్యాక్టరీ కాలనీలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యేలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జెట్పీడీసీ తమ్మిశెట్టి బాలయ్య, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

31న చిత్ర లేఖన పోటీలు

చాపాడు: స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఈ నెల 31న చిత్ర లేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ వి.జయచంద్రారెడ్డి తెలిపారు. మూడు విభాగాల్లో 1 నుంచి 9వ తరగతి వరకూ విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు నగదుతో పాటు బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 27 లోగా సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాల్లో రూ.500, రూ.400, రూ.300ల చొప్పున ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. వివరాలకు 8500857111, 850086111 నంబర్లను సంప్రదించాలని చైర్మన్ కోరారు.

వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపిద్దాం



సమావేశంలో పాల్గొన్న వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డి, తదితరులు



పాల్గొన్న ఆర్యవైశ్యులు

పులివెందుల : రాబోయే ఎన్నికల్లో పులివెందుల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అలాగే కడప ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డిలను అఖండ మెజార్టీతో గెలిపిద్దామని వైఎస్సార్సీపీ నేతలు వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డిలు తెలిపారు. గురువారం సాయంత్రం భాకరాపురంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డిలను అఖండ మెజార్టీతో గెలిపించడానికి ఆర్యవైశ్యులు సహకారం అందించాలన్నారు. ఐదు దశాబ్దాలుగా పులివెందులలోని ఆర్యవైశ్యులు వైఎస్ కుటుంబ సభ్యులను ఆదరిస్తున్నారన్నారు. అలాగే వారికి కూడా వైఎస్ కుటుంబ సభ్యులు అండగా ఉంటున్నారన్నారు. ఆర్యవైశ్య సంఘం వైఎస్ కుటుంబ సభ్యులకు అన్ని వేళలా వెంట నడిచారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ స్థాపించినప్పుడు కానీ, ఆయన కష్టకాలంలో కానీ ఆర్యవైశ్యులు మేమున్నామంటూ తోడుగా ఉన్నారన్నారు. ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు కొత్త రవికుమార్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్ అవినాష్‌రెడ్డికి ఆర్యవైశ్య సంఘం తరపున పూర్తి మద్దతు ఉంటుందన్నారు. పులివెందులను మహానేత వైఎస్సార్, ఇప్పుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డిలు ఎంతో అభివృద్ధి చేశారన్నారు. పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర సివిల్‌సప్లై డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ మిట్ట హరి, ట్రెజరర్ గంగాధర, పులివెందుల ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ పట్టాభి రామయ్య, మహిళామండలి చైర్మన్ మాధవిలత, రాష్ట్ర మహాసక ట్రెజరర్ మిట్టా కరుణాకర్, ఆపోపా సెక్రటరీ సాయిబాబా, గండి ట్రస్ట్ బోర్డు మెంబర్ బిందుసాగర్, వాసవిక్లబ్ అధ్యక్షుడు మహేశ్, పబ్బతి నారాయణ, పట్టణంలోని ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

మేము పార్టీ మారలేదు



టీడీపీ నాయకులు బలవంతంగా కండువాలు వేశారని తెలుపుతున్న వడ్డెర కులస్తులు

వీరపునాయునిపల్లె : మేము తెలుగుదేశం పార్టీలోకి చేరలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నామని మండలంలోని సంగాలపల్లె బీసీ కాలనీకి చెందిన వడ్డెర కులస్తులు తెలిపారు. గురువారం వడ్డెర కులస్తులు మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి వద్దకు వెళ్లి మేము ఎవ్వరూ పార్టీ మారలేదని మాకు బలవంతంగా టీడీపీ కండువాలు వేశారన్నారు. బుధవారం సాయంత్రం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా కాలనీలోకి వచ్చిన తెలుగుదేశం నాయకులు నరసింహారెడ్డి వచ్చి అందరూ ఒకచోటికి రావాలనడంతో అక్కడకు వెళ్లామన్నారు. అయితే టీడీపీ కండువాలు బలవంతంగా మాపై వేసి ఫొటోలు తీశారన్నారు. దీనిపై మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం నాయకులు బలవంతంగా కండువాలు వేసి పార్టీలో చేరారని పత్రికల్లో రాయించుకోవడం మానుకోవాలన్నారు. ఒక్క సంగాలపల్లె గ్రామంలోనే కాకుండా మండలంలోని ప్రతి గ్రామంలో ఇదే తంతు కొనసాగిస్తున్నారన్నారు. దిగజారుడు రాజకీయాలకు ఇదొక నిదర్శనమన్నారు. తెలుగుదేశం నాయకులు విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని హితవు పలికారు. మండలంలో తెలుగుదేశం పార్టీ తమ ఉనికిని కోల్పోయిందన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని 9వ డివిజన్ ఎన్‌జీవో కాలనీలో వెలసిన గంగమ్మ దేవాలయంలో జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని కడప మేయర్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కె.సురేష్ బాబు దర్శించుకున్నారు. 9వ డివిజన్ ఇన్‌చార్జి మల్లికార్జున కిరణ్, గుడి ధర్మకర్త కంబగిరి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్ మనోహర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరిన ముస్లింలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న జయమ్మకాలనీలో ముస్లిం మైనార్టీ 10 కుటుంబాలు గురువారం వైఎస్ మనోహర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను, ముస్లింలకు చేస్తున్నటువంటి అభివృద్ధి గురించి పది కుటుంబాలకు తెలియజేయగా అందుకు ఆకర్షితులై టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీ పార్టీలోకి రావడం జరిగిందని మైనార్టీ అధ్యక్షులు నూరుల్లా తెలిపారు. ఇందులో భాగంగా మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్, మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, నూరుబాషా కార్పొరేషన్ చైర్మన్ ఓ.రసూల్, సివిల్ సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డిల ఆధ్వర్యంలో 10 కుటుంబాలకు వైసీపీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఖాదర్‌వలి షరీఫ్, సలీం, రెహమాన్‌లతో కలిసి నూరుల్లా మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముస్లింల ద్రోహి అని, బీజేపీతో పొత్తుపెట్టుకున్నాడన్నారు. బీజేపీ ఎన్ఆర్‌సీ కార్యక్రమం చేపడితే దానికి చంద్రబాబు సపోర్ట్ చేస్తున్నాడన్నారు. జగనన్న ముస్లింలకు 7 ఎమ్మెల్యే సీట్లు కేటాయించారన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి పురుషోత్తంరెడ్డి, కౌన్సిలర్లు రమణ, పార్నపల్లికిశోర్, పద్మనామంరెడ్డి, చంద్రమౌళి, చంద్రా సంపత్, నాగరాజు, ఖాదర్, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ముస్లింలు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలో అన్నివర్గాలకు ప్రాధాన్యత



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : జగనన్న ప్రభుత్వంలో అన్నివర్గాలవారికి ప్రాధాన్యత లభిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డిలు తెలిపారు. గురువారం మైలవరం మండలంలోని దొమ్మరనంద్యాల, తొర్రివేముల, గంగుల నారాయణపల్లె గ్రామాల్లో పలువురు రామసుబ్బారెడ్డి వర్గీయులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీ పార్టీలో చేరారు. అనంతరం వారు విస్తృతంగా ప్రచారం నిర్వహించి మాట్లాడారు. దేశ చరిత్రలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, క్రిస్టియన్ లకు సమానంగా పదవులు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను అమలు పరచిన ఘనత జగనన్నకు దక్కుతుందన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందన్నారు. జగనన్న ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమపథకాలు అందాయన్నారు. చేనేత కార్మికులు పడుతున్న కష్టాలను చూసి వారికి 50 సంవత్సరాలకు పింఛన్, నేతన్న నేస్తం పథకం కింద ప్రతి ఏడాది రూ.24 వేలు వారి ఖాతాల్లో వేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఏకమై వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డిలను ఫ్యాను గుర్తుపై ఓటు వేసి చంద్రబాబు, పవన్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు తగిన బుద్ధిచెప్పాలని వారు పిలుపునిచ్చారు.

50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక..

మైలవరం మండలం పి.రామసుబ్బారెడ్డి వర్గీయులైన తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు తొర్రివేముల గుర్విరెడ్డితో పాటు తొర్రివేముల గ్రామానికి చెందిన 20 కుటుంబాలు అలాగే గంగుల నారాయణపల్లె గ్రామంలోని చిన్న గురువయ్య, గురుమోహన్‌రెడ్డి, గురుశేఖర్, చిన్న నాగుషితో పాటు మరో 30 కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జమ్మలమడుగు ఎన్నికల కన్వీనర్ సంబటూర్ ప్రసాద్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు భీమునిపల్లె రామయ్య, మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వర్‌రెడ్డి, బీసీ రాష్ట్ర చేనేత నాయకుడు బడిగించల చంద్రమౌళి, యనమల వేణుగోపాల్‌రెడ్డి, జయరామిరెడ్డి, ఆదాం, హాజీబాషా, సుబ్బయ్య, గుర్విరెడ్డి, ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన జగనన్నతోనే సాధ్యం



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న షబ్బీర్‌వలి, తదితరులు

వేంపల్లె : పేద ప్రజలకు సంక్షేమ పాలన అందించాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని మాజీ జడ్పీటీసీ సభ్యుడు, ఏపీ సివిల్‌సప్లై సంస్థ డైరెక్టర్ షబ్బీర్‌వలి తెలిపారు. గురువారం స్థానిక భరత్‌నగర్, జెండామానువీధి, తిరుమలహాలు వీధి, కుమ్మరవీధి, తదితర ప్రాంతాల్లో మేము సిద్ధం–మాబూత్ సిద్ధం కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఇంటి గడపకు వెళ్లి గడిచిన ఐదేళ్లలో సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి బాటలో ప్రయాణిస్తోందన్నారు. అలాగే జిల్లా అభివృద్ధితో పాటు నియోజకవర్గంలోని పులివెందుల, వేంపల్లె మండలాలు అత్యంత ప్రాధాన్యత చాటుకునే విధంగా అభివృద్ధి జరిగాయన్నారు. నవరత్నాల్లోని ప్రతి పథకాన్ని అమలు చేశారన్నారు. పేదల పక్షపాతిగా, పేదల గుండెల్లో స్థానం సంపాదించుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించి మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలని కోరారు. అంతేకాకుండా జిల్లా అభివృద్ధి, నియోజకవర్గ అభివృద్ధిలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవ ఎంతో ఉందన్నారు. నిరంతరం ప్రజా సేవకే తపిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హబీబుల్లా, వార్డు సభ్యుడు సురేంద్ర, ఎస్టీ సమీర్, ప్రభాకర్ రెడ్డి, మదార్, నాయబ్, లోకేష్, సుబ్బరాయుడు, పండు, తదితరులు పాల్గొన్నారు.

అడవుల వల్ల ఆర్థిక సామాజిక ప్రయోజనాలు



గెలుపొందిన విద్యార్థినికి బహుమతిని అందజేస్తున్న డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ గుర్రప్ప

వేంపల్లె : అడవుల వల్ల ఆర్థిక, సామాజిక ప్రయోజనాలు ఉంటాయని వేంపల్లె డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ గుర్రప్ప తెలిపారు. గురువారం స్థానిక చైతన్య ఉన్నత పాఠశాలలో ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురష్కరించుకుని విద్యార్థినీ, విద్యార్థులకు ×అడవుల ప్రాముఖ్యత–వాటి ప్రయోజనాలు¶ అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు మనకు శ్వాస తీసుకోవడానికి స్వచ్ఛమైన గాలి, ఆహారం, మందులు, కలప, తదితర ముడిపదార్థాల వంటి ఇతర వనరులను అందిస్తాయన్నారు. నేలకోతను అరికట్టడం ద్వారా భూమిని స్థిరంగా ఉంచడానికి అడవులు ఎంతో సహాయపడతాయని తెలిపారు. సుగంధ ద్రవ్యాలు, మందులు, కాగితం, తదితర వాటిని అటవి ఉత్పత్తులు తయారవుతాయన్నారు. వక్తృత్వం పోటీల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులకు డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ గుర్రప్ప చేతులమీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్లు చేతన్‌రెడ్డి, చైతన్యరెడ్డి, ఫారెస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణకు హోమియోలో మందులు



విద్యార్థులకు హోమియో మందులు మింగిస్తున్న డాక్టర్ షాకీర్‌హుసేన్

కమలాపురం : వడదెబ్బ నివారణకు హోమియోలో మందులు ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ హోమియో వైద్యాధికారి షాకీర్ హుసేన్ తెలిపారు. గురువారం పట్టణ పరిధిలోని కె. అప్పాయపల్లెలో ఉర్దూ, తెలుగు ప్రాథమిక పాఠశాల్లో హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులందరికి వడదెబ్బ నివారణకు నాట్రమ్ మురియాటికం–200 మింగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడదెబ్బ నివారణకు హోమియోలో అద్భుత మందులు ఉన్నాయని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఎండల్లో తిరిగే వారు, ఉపాధి కూలీలు ఈ మందులను వినియోగించు కోవాలన్నారు. వడదెబ్బ సోకకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వదులుగా ఉన్న నూలు దుస్తులు ధరించాలన్నారు. ఉదయం 11 గంటలకే ఇంటికి చేరుకోవాలని, సాయంత్రం 5 గంటల వరకు బయటకు రావద్దన్నారు. అలాగే మజ్జిగ, నన్నారి, నీళ్లు ఎక్కువగా తాగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, హోమియో సిబ్బంది పాల్గొన్నారు.

డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన అవసరం

కడప కల్చరల్ : పిల్లలు మానసిక వికలాంగులుగా పుట్టేందుకు కారణమవుతున్న డౌన్ సిండ్రోమ్ పట్ల తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని అల్ షిఫా కేంద్రం వ్యవస్థాపకులు మహమ్మద్ రఫీ తెలిపారు. గురువారం ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవం సందర్భంగా కడప నగరం పాత రిమ్స్‌లోని అల్ షిఫా కేంద్రంలో తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ డౌన్ సిండ్రోమ్ అనేది క్రోమోజోమ్ సాధారణ పరిస్థితి వల్ల ఏర్పడుతుందన్నారు. మానవ శరీరంలో 21 జతల క్రోమోజోములుకు అదనంగా ఒక క్రోమోజోమ్ ఉంటే డౌన్ సిండ్రోమ్ పుట్టే అవకాశాలు ఉన్నాయన్నారు. డౌన్ సిండ్రోమ్ భౌతిక లక్షణాలను బాదం ఆకారంలో కళ్లు, చిన్న మెడ, చిన్న చెవులు, నోటిలో నుంచి బయటికి వచ్చేలా ఉండే నాలుక, చిన్న చేతులు, కాళ్లు, పిల్లలు, పెద్దలు ఎత్తు తక్కువగా ఉండడంగా చెప్పవచ్చన్నారు. 700 మంది శిశువులలో ఒకరికి ఈ సమస్య వస్తుందని, సాధారణంగా గర్భధారణ సమయంలో 35 ఏళ్ల కంటే ఎక్కువ వయసు ఉన్న తల్లులకు డౌన్ సిండ్రోమ్ పిల్లలు జన్మిస్తారన్నారు. గర్భధారణ సమయంలో జాగ్రత్తగా ఉండాలని, వీలైనంత వరకూ మేనరికపు వివాహాలకు దూరంగా ఉండాలన్నారు.

లక్ష్మీనరసింహుని కల్యాణం.. కమనీయం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

తొండూరు : మండలంలోని గ్రామ సమీపంలో ఉన్న నవ నరసింహ సహిత లక్ష్మీనరసింహ స్వామి చతుర్థి వార్షికోత్సవం, రాజగోపుర శిఖర కలశ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా గురువారం ఆలయ అర్చకులు రమణయ్యశాస్త్రి ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. తెల్లవారుజామున్నే రాజగోపుర శిఖర కలశ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం భూమిరెడ్డి వెంకటనారాయణమ్మ, కే.శే.భూమిరెడ్డి వెంకటరెడ్డి వారి కుమారుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణోత్సవానికి వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు తిరుపతిరెడ్డి

పోరుమామిళ్ల : బద్వేలు ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన కామ్రేడ్ కల్లూరు తిరుపతిరెడ్డి నేటితరం కమ్యూనిస్టులకు ఆదర్శప్రాయుడని ఆ పార్టీ నేతలు కొనియాడారు. గురువారం తిరుపతిరెడ్డి 9వ వర్ధంతిని పురస్కరించుకొని రాజాసాహేబ్‌పేటలో ఆయన స్థూపం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన నివాళి అర్పించారు. తిరుపతిరెడ్డి తెలుగుగంగ ప్రాజెక్టు కోసం, రైతాంగ సమస్యల పరిష్కారానికి భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం



ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్

కొండాపురం : రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని ప్రొద్దుటూరు ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ తెలిపారు. గురువారం మండలంలోని యర్రగుడి పునరావాస కేంద్రంలో ఆయన పర్యటించి ఇంటింటికి తిరుగుతూ కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధీర్‌రెడ్డిని ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను అభ్యర్థించారు. గతంలో టీడీపీ నాయకులు తప్పుడు హామీలు చెప్పి అమలు చేయలేకపోయ్యారన్నారు. సీఎం జగనన్న ఎన్నికల సమయంలో చెప్పిన ప్రతి హామీని అమలు చేశాడన్నారు. రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే మరోసారి వైఎస్ జగనన్నను సీఎం చెసుకుందామని ప్రజలతో ఆయన కోరారు. పింఛన్లు ఇంటి వద్దకే పంపిణీ కొనసాగాలంటే అవ్వతాతలు తప్పకుండా ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాల సలహా కమిటీ చైర్మన్ ఒంటెద్దు రఘునాథరెడ్డి, మండల కన్వీనర్ జగదీశ్వర్‌రెడ్డి, ఉప మండలాధ్యక్షుడు విజయ్ భాస్కర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ కార్యదర్శి అల్లం సత్యం, డీలర్ పి.సుధాకర్‌రెడ్డి, కోడూరు శివన్న, దాది శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ మార్పు ప్రక్రియలో 'రెవెన్యూ' నిర్లక్ష్యం

ముద్దనూరు : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో భూమి (మ్యుటేషన్)మార్పు ప్రక్రియలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. భూమి క్రయ విక్రయాల, రిజిస్ట్రేషన్‌ల అనంతరం ఆన్‌లైన్‌లో రైతులు భూ మార్పుకు దరఖాస్తు చేసుకుంటారు. తర్వాత తహసీల్దారు కార్యాలయంలోని సిబ్బంది వాటిని పరిశీలించి 15 రోజుల తర్వాత మ్యుటేషన్(మార్పు)ను పూర్తిచేయాల్సివుంటుంది. వీటి పూర్తి బాధ్యత రెవెన్యూ సిబ్బందిదే. అయితే స్థానిక రెవెన్యూ కార్యాలయంలోని సిబ్బంది సమన్వయలోపంతో కొద్దిరోజులనుంచి భూముల మ్యుటేషన్(మార్పు)లలో తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు రైతులు వాపోతున్నారు. ఇటీవల కాలంలో అధికారుల, సిబ్బంది మధ్య సమన్వయ లోపంతో సుమారు 40 భూ మ్యుటేషన్ల(మార్పు) ప్రక్రియ అస్తవ్యస్థంగా తయారైంది. సరైన కారణాలు లేకుండానే మ్యుటేషన్ల(మార్పు)ను రిజెక్ట్‌చేశారని దీంతో తాము మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఇది వ్యయప్రయాసలతో కూడుకున్నదన్నారు. ప్రభుత్వం ఆటో మ్యుటేషన్ ప్రక్రియ అమలు చేస్తున్నప్పటికీ స్థానిక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమని ఉన్నతాధికారులు చొరవ చూపి మ్యుటేషన్లను సకాలంలో పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.

తాటి ముంజలకు గిరాకీ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రస్తుతం వేసవి కాలంలో ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు చల్లదనాన్ని అందించే తాటి ముంజలకు యమ గిరాకీ ఉంది. నగరంలోని కోటిరెడ్డి సర్కిల్, ఎస్పీ బంగ్లా, అప్సర సర్కిల్, ఐటిఐ సర్కిల్, రింగ్ రోడ్డు సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో వీటి అమ్మకాలు సాగిస్తున్నారు. జిల్లాలోని పెండ్లిమర్రి మండలం నందిమండలానికి చెందిన పలువురు తాటి ముంజలను డజను రూ.100 వరకు అమ్ముతున్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోండి



కొండాపురం : సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



ఎర్రగుంట్లలో ర్యాలీలో పాల్గొన తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ, అధికారులు



చెన్నూరు : ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, పోలీసు సిబ్బంది

కొండాపురం : ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ వేణుగోపాల్ తెలిపారు. గురువారం తాళ్లప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని టి.కోడూరు, కొత్తపల్లె, తాళ్లప్రొద్దుటూరు, ఏటూరు, బెడుదూరు, యనమలచింతల గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలసి పోలీసులు కవాతు నిర్వహించినట్లు సీఐ తెలిపారు. గ్రామాల్లో ఏమైన సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకు రావాలన్నారు. ఎవరైన అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఫ్యాక్షన్ జోన్ సీఐ నారాయణ యాదవ్, తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

ఎర్రగుంట్ల : వచ్చే ఎన్నికల్లో ఓటర్లందరు తమ ఓటు హక్కును కచ్చితంగా వినియోగించుకోవాలని తాహసీల్దార్ సౌజన్యలక్ష్మీ తెలిపారు. గురువారం పట్టణంలో ఓటు హక్కు వినియోగంపై నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఐదేళ్లకు ఒక్కసారి వచ్చే ఓటు ఆయుధం లాంటిదన్నారు. ఈ ర్యాలీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు సాగి అక్కడ అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ రామకృష్ణయ్య, ఎంఈఓలు శివప్రసాద్, వెంకటేశ్వర్లు, ఎస్ఐ చిరంజీవి, పాఠశాల హెచ్ఎం రామాంజనేయరెడ్డి, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూరులో..

చెన్నూరు : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సీఐ పార్థసారథి తెలిపారు. గురువారం మండలంలోని రాచినాయపల్లె, రామనపల్లె గ్రామపంచాయతీ, అలాగే చెన్నూరు తూర్పు దళితవాడలో కేంద్ర బలగాలతో ఆయన కవాతు నిర్వహించి మాట్లాడారు. సమస్యాత్మకమైన గ్రామాలలో తమ ఓటు హక్కును ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చునన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శివయ్య, రామిరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.